# ఉపనిషత్తులు

వేదములందలి చివరి భాగములకు ఉపనిషత్తులని పేరు. వేదముల తుది భాగములగుట వలన, "వేదాన్తములు" అని కూడ పిలుచుచున్నారు. వాటియందున్న భావములకు వేదాన్తమను పేరు గూడ ప్రఖ్యాతమయినది. వేదమునందలి ప్రతి శబ్దమును అనేకార్థములనీయగలిగినదిగా నుండును. వేదము అన్ని లోకములను గూర్చి చెప్పును. అందువలన, అన్ని లోకములందును జరుగు కార్యములకు (యజ్ఞములకు) అనువైన శబ్దములుండును. అటులనే మానవుల విషయమున గూడ. శరీరబలముచేత, పొందిన విద్యలచేత, వెంట వచ్చిన అభిరుచులచేత, మానవులు అనేక విధములు కదా! మూడు శరీరములందును (స్థూల, సూక్ష్మ, జ్ఞాన) అనేకమైన తరతమభేదములతో పుట్టు నీ సకల మానవాళికని ఆ మన్త్రములు అర్థవంతములు, ఉపయోగకరములు – అనినచో వేద శబ్దములకు బహ్వర్థములుండి తీరును.

ఉపనిషత్తు – రెండు మాటలకలయిక. ఉపని+షత్తు. షత్తు అనిన శబ్దము షత్ ధాతువు (క్రియ) నుండి పుట్టినది. షత్ అనగా ఉండుట అని అర్థము. షత్తు అనగా ఉండుట అని అర్థము. షత్తు అనగా ఉన్న చోటు, లేక ఉండుటకనువైన చోటు, అని అర్థము. పండిత పరిషత్తు – పండితులున్న చోటు. మొదటి శబ్దము "ఉపని" – "ఉపని", "ఉప" రెండును సమానార్థకములు. ఒకటియే అర్థమునిచ్చు ఉపసర్గలు. ఏదైన శబ్దమునకు ముందుండునది ఉపసర్గ. ఆ క్రియా భావము నందు విశేషతను కల్పించుటకు, శబ్దమునకు ముందుండునది ఉపసర్గ. ఆ క్రియా భావముయొక్క అర్థము నందు కొంత మార్పును తెచ్చును.

"ఉపని" – అనిన ఉపసర్గకు సమీపే – దగ్గరగా అని ఒక అర్థము. ఉపనిషత్తనగా దగ్గరగానున్నది. నిరంతరము మనకు సమీపముగా, మన వెంటనుండెడిది ఏది? "అహమ్" అనిన జ్ఞానము, "నేను" అన్న భావము. ఈభావము మనలను వదలదు. అందువలన ఇది ఉపనిషత్తు. వేదభాగమైన ఉపనిషత్తు మనదైన ఉపనిషత్తును గూర్చి చెప్పును "అహం వృక్షస్య రేరివా (ప్రేరకః)" అని తైత్తిరీపనిషత్తు. నేను సంసారమనెడు వృక్షమునకు ప్రేరకుడను – అని అర్థము. "నేను" – అనిన పురుషుడు ఎన్ని విధములుగ మారునో,ఆ "నేను" అనిన మాటకు ఎన్ని అర్థములు పుట్టునో తైత్తిరీయోపనిషత్తు విశదముగా తెలిపినది.

నేను అనిన భావము మనలనెట్లు విడుచుట లేదో, అటులనే మన ఇంద్రియములు (కన్ను, ముక్కు, చెవులు.....) మనస్సు, ప్రాణము, శరీరముగూడ మనవెంటనున్నవనియే కదా! కనుక, ఇవి యన్నియు ఉపనిషత్తులు. ఈ ఉపనిషత్తులను గురించి ప్రశ్నోపనిషత్తునందు వివరింపబడినది. "ప్రాణాగ్నయ ఏవై త స్మిన్ పురే జాగ్రతి" చెవులు మొదలైనవి నిద్రింపగా, శరీరమను పట్టణమునందు ప్రాణ, అపాన, వ్యాన, సమాన, ఉదానములనిన పంచాగ్నులు మేల్కొని యుండును. మన ఉపనిషత్తులనుగూర్చి తెలియవలెననినచో, వేదోపనిషత్తులను చూడవలెను.

ఉపని శబ్దమునకు, "సర్వము", లేక సకలము అను అర్థము గూడ ఉన్నది. కనుక ఉపనిషత్తనగా సకలమునందు ఉన్నట్టిది. ఏ జ్ఞానరూపమైన ఆత్మ మనయందున్నదో, అదియే పృథివి, అంతరిక్షములయందుగూడ నున్నదని వేదము చెప్పుచున్నది. దానికి "బ్రహ్మము" అని వేదమిడిన పేరు. కనుక ఉపనిషత్తనగా సర్వాంతర్యామియైన చైతన్యము. వేదోపనిషత్తులందు ఈ చైతన్యస్వరూపము విశదీకరింపబడినది. "పురస్తాద్బ్రహ్మ, పశ్చాద్బ్రహ్మ, దక్షిణత శ్చోత్తరేణ అధోశ్చోర్ధ్వంచ, ప్రసృతం బహ్మై వేదం విశ్వమిదం వరిష్ఠం" - ముండకోపనిషత్తు (2-2-11). ముందున్నది బ్రహ్మము, వెనుకను, దక్షిణమునందు, ఉత్తరమునందు, క్రిందను, పైనను, వ్యాపించినది బ్రహ్మమే. శ్రేష్ఠమగు నీ విశ్వ మంతయు బ్రహ్మము - అని అర్థము. ఉపనిషత్తు అయిన బ్రహ్మమును, వేదోపనిషత్తులు విస్పష్టము జేసినవి.

"ఉప" - లేక "ఉపని" శబ్దములకు ప్రథమము (మొదటిది) లేక ముఖ్యమయినది అను అర్థమున్నది. మనము ముఖ్యము అనుకొనెడిది ఏది? పసితనమునందు ఆటలు, కొంచెము పెరిగిన తరువాత విద్య, బ్రతుకు తెరువు. ఆ తరువాత ధనము. వార్ధక్యమునందు ఆరోగ్యము. ప్రాణము తబ్బిబ్బులైన వేళ ఆయుర్దాయము. అందువలననే వేదము, మానవుని వర్తమాను డనినది. ఆ కాలమందేది ముఖ్యమయిన, అదియే జీవితముఖ్యముగా భావింతుము. కాలము మారి నను, ఆ కాలముతో పాటు ప్రయాణము సేయునది మనమే గదా! ఆ అసలైన "మనము" నకు వేరుగా ముఖ్యమయినది ఉండి తీరవలెను. ఆ ముఖ్యమయినదానిని మనము తెలుసుకొనవలెను. అపుడు ఈ మారుచున్న ముఖ్యములు నిజముగా ముఖ్యములగునో కాదో మనము నిర్ణయించుకొనవచ్చును. ముఖ్యమయినది ఏదియో వేదము నిస్సంశయ ముగా తెలియజెప్పినది. అది ఆత్మ తృప్తి. మన ఆత్మకు తృప్తి అయినచో, మనమే పని అయినను చేసెదము. ప్రాణమునకు తెగించెదము. ఆహారమును లెక్క సేయము. సుఖదుఃఖములను పాటింపము. మన ఆత్మకు తృప్తి కలుగవలెను. క్షణికములైన తృప్తులు కాక ఆత్మకు తగిలెడి తృప్తియే తృప్తి."సయ ఏవం విద్వానేతే ఆత్మా సంస్పృణుతే, ఉభేహ్యేవైష ఏతే ఆత్మా సంస్పృణుతే యఏవం వేద, ఇత్యుపనిషత్ " తైత్తిరీయోపనిషత్తు (9-3) తెలిసినవాడు ఆత్మను సంతృప్తి పరచును. అపుడు సుఖదుఃఖములు బాధింపవు. దీనిని తెలిసికొనుము, ఇది ఉపనిషత్తు - అని.

ఆత్మను సంతృప్తి పరచుటయే ఉపనిషత్తని. వేదమిచ్చుట, ఉపనిషచ్ఛబ్దమునకు క్రొత్త అర్థమును స్ఫురింప జేయుచు న్నది. ఈ విధముగా వేదము, మన్త్రమునందలి శబ్దములతో, మనలో మనము త్రవ్వుకొనుటకువీలుగలుగ జేయును. మన్త్ర ములు మనస్సును దృఢముగా పట్టుకొనుటకావిర్భవించినవి కదా!

ఉపని - పూర్వః. ఉపని యనగా పూర్వము. దేనికి పూర్వము? మనకు పూర్వము. మనము పుట్టుటకు పూర్వము. మనమీ జన్మ ఎత్తకముందున్నది మన జీవాత్మ. సృష్టికి పూర్వమందున్నది పరమాత్మ. పూర్వమే ఉన్న రెంటిని గురించి చెప్పునది ఉపనిషత్తు. ఉపనిషత్తనగా రహస్యము. రహస్యమునందిద్దరే ఉందురు. మూడవవాడున్నచో అది రహస్యము కాదు. బట్టబయలు రహస్యమనగా మూడవవానికి తెలియకుండ ఆలోచించుట. ప్రతి జీవికిని కొన్ని రహస్యములుండును. వానిని రెండవ ప్రాణి, ఎంత ఆత్మీయుడైనను, ఆత్మీయురాలైనను, తెలియజేయడు. ఇది ఎవరికి వారికి తెలిసిన విషయము. ఆ రహస్యములు తనశరీరమునకు బయట నున్న వారితో చెప్పి ప్రయోజనము లేదని

తనకు తెలియును. మరి ఆ రెండవ వారెవరు? ఆ రెండవ ఆత్మ పరమాత్మ. ఆ పరమాత్మ లో నున్నదనుకొనువారు లో నున్న పరమాత్మతో ఆలోచింతురు. తిరుపతి కొండమీద నున్నవాడనుకొనువారు, కొండవైపునకు తిరిగి, ఏకాంత ముగా తన రహస్యములను, తెలుపుకొనెదరు. లేదు,ఇక్కడెక్కడను లేడు. స్వర్గములోనున్నవాడు. అని మరి కొందరి నమ్మిక. ఆ స్వర్గము ఆకాశమునందున్నదని, తలపైకి ఎత్తి, మరి ఎవరును వినకుండా తమలో తాము చెప్పుకొనెదరు. ఈ జీవాత్మ, పరమాత్మల మధ్య రహస్యములను గురించి చెప్పునది ఉపనిషత్తు.

"ద్వాసుపర్ణా సయుజా సఖయా సమానం వృక్షం పరిషస్వజాతే తయోరన్యః పిప్పలం స్వాద్వత్త్య నశన్న న్యో అభిచాకశీతి" – ముండకోపనిషత్తు (3.1.1..... )

మంచి రెక్కలతోడివి, కలిసి ఉన్నవి సఖులు అయిన రెండు పక్షులు ఒకే వృక్షమును ఆశ్రయించి ఉన్నవి. ఒకటి (జీవాత్మ) ఇష్టమైన ఫలమును అనుభవించుచున్నది. రెండవది (పరమాత్మ) అనుభవింపక, చూచుచున్నది – అని తాత్పర్యము. వేదము సంపూర్ణమైన జ్ఞానము. అనగా రహస్యము గూడ అందులోని భాగమే. వీరిద్దరి మధ్య ఉన్న రహస్యము గూడ వేదోపనిషత్తులోని భాగమయినది!

ఉపనిషత్తనగా అన్ని అర్థములును ఉన్నచోటు. వేటి అర్థములున్నచోటు? తక్కిన వేదభాగములయందున్న మంత్ర ములకు అర్థములున్నచోటు. అందువలననే వేదము ఈ భాగములకు ఉపనిషత్తని పేరిడినది. దగ్గరగానున్నవి, అర్థము చూచుకొనుమని చెప్పినది.

ఈ సృష్టి సంహితారూపము. ఒకదానితో మరియొకటి కలిసి యుండును. తండ్రి, ఆ తండ్రికి పుత్రుడు. ఆ పుత్రుడు తిరిగి తండ్రి. గురువు, ఆ గురువునకు శిష్యుడు. శిష్యుడు తిరిగి గురువు. వృక్షము, వృక్షమునకు ఫలము. ఆ ఫలము తిరిగి వృక్షము. పొడిగించిన కాలమునందు జూచినచో, సృష్టియంతము సంహితామయము. మానవునకు రెండవ సృష్టి కూడ ఉన్నది. ప్రతి "వస్తువు" ను కొద్ది కాలమునందు మాత్రము చూచుట. ఆ కొద్దికాలములో గురువు వేరు, శిష్యుడు వేరు. తండ్రి వేరు, కొడుకు వేరు. మన జ్ఞానమంతయును, ఈ రెండు విధములైన దృష్టులతో సాధింతుము. కనకనే ఈ సృష్టిస్వరూపమును వివరించుటకు శబ్దరూపముగా నవతరించిన వేదము "సంహితా". బ్రాహ్మణములనిన రెండు భాగములుగా వెలువడినది. బ్రాహ్మణమునందు మూడు భాగములున్నవి. బ్రాహ్మణము, ఆరణ్యకము, ఉపనిషత్తు. ఈ మూడింటికిని కలిపి బ్రాహ్మణమని వ్యవహారము. బ్రాహ్మణభాగమునందు సంహితలో చెప్పిన భావములను, వస్తువులను, ప్రాణులను, దేవతలను, శబ్దములను వేరువేరుగ జూపి, వాటి అర్థములు, ప్రయోజనములువివరించును. బ్రాహ్మణభాగమునందు భౌతిక శరీర కర్మపరముగా, ఆరణ్యకమునందు మానసికపరముగా, ఉపనిషత్తునందు జ్ఞాన పరముగా అర్థప్రయోజనములను జూడవచ్చును. తాత్పర్యము–బ్రాహ్మణములు–మూడు దేహముల ఉపయోగము కొరకు ఏర్పడిన సంహితావ్యాఖ్యలు. వేదముఒక్క సంహితా రూపముగ మాత్రమున్నచో, మనకు సృష్టి విధానము కొంతవరకు మాత్రమే తెలిసెడిది. బ్రాహ్మణములందలి వ్యాఖ్యలు ఏ ఒక్క దేహమునకు మాత్రము ఉపయోగకరముగా

నుండినచో, సృష్టియొక్క సంపూర్ణ స్వరూపము మనకవగాహనమయ్యెడిది కాదు. భూత, భవిష్యద్వర్తమానకాలము నందు నిత్యము జరిగిన, జరుగుచున్న, జరుగనున్న మహాయజ్ఞములను సంహితయందు జెప్పి, ఆ నిత్యసత్యములను, ఏ జీవికాజీవి, వారి వారి వర్తమానకాలము లందు వారి మూడుదేహముల యందు సత్యములెట్లు వారి జీవన విధాన ములను ప్రభావితము సేయునో వేదము వివరించినది. అందువలన వేదము సంపూర్ణజ్ఞానము. బ్రాహ్మణము లేనిచో వేదము అర్థ-జ్ఞానము. బ్రాహ్మణ-ఆరణ్యక-ఉపనిషత్తులలో ఏ భాగము లోపించినను, వేదము సంపూర్ణజ్ఞానము కాదు. కావుననే ఆపస్తంబమహర్షి "మన్త్రబ్రాహ్మణయోర్వేదనామధేయమ్" (ఆపస్తంబ పరిభాషాసూత్రములు, (1-33) ) - మన్త్రబ్రాహ్మణములు రెండును కలిసి వేదమని ఉద్ఘాటించెను.

"సంహితా ఉపనిషదం వ్యాఖ్యాస్యామః", అని తైత్తిరీయోపనిషత్తు (3.1) ఈ వాక్యమునకు రెండర్థములను చెప్ప వచ్చును. "సంహిత", అని పేరు గలిగిన ఉపనిషత్తును వ్యాఖ్యానింతుము. లేదా, సంహితరూపమున సృష్టియంతయు అల్లుకొనిన ఉపనిషత్తును (బ్రహ్మమును) వ్యాఖ్యానింతుము. ఈ వేద వాక్యమునందు "ఉపనిషత్తు" అనిన శబ్దమునకు బ్రహ్మమనియు, వేదభాగమనియు-రెండర్థములును కనబడుచున్నవిగదా! వేదమీ విధముగా సృష్టియందలి అనేక కార్యములకు,ఋతులకు, ప్రాణులకు వాటివాటి పుట్టుకను, సహజ ధర్మమును తెలియపరచు ఒకే శబ్దమునుపయోగించి, వాటి యందలి సారూప్యమును జూపును. అన్నిటియందును, పూసలలో దారమువలె మెలుగుచున్న బ్రహ్మస్వరూప మును వెలికి తెచ్చును. ఈ విధముగా భిన్నవిషయమునందలి సమాన ధర్మమును జూచుట కలవాటు పడిన మనస్సు, క్రమముగా సృష్టిగతాఖిలవిషయము లందలి ధర్మములకు మూలభూతమైన బ్రహ్మమును గూర్చి తలచుట నారంభించును. ఆ మహాప్రయోజనార్థమే వేదము అనేకార్థములు కలిగిన శబ్దములు వాడును.

ఉపనిషత్తులు వేదభాగములగుటవలన, ఏ వేద మన్త్రములోని మహార్థములను, ఆ మన్త్రరహస్యములను, ఆ వేదోపని షత్తులందు చూడవలెను. ఐతరేయము ఋగ్వేద ఉపనిషత్తు. ఋగ్వేదము కర్తల వేదము. మనము చేయు పనులకు వెనుక నున్న ధైర్యము, ఆరోగ్యము, దీక్ష, నియమము, ఆయుర్దాయము మొదలయిన భాగ్యములకు కర్తలయిన అగ్ని, వాయు, సూర్యశక్తులవంటి దేవతా శక్తులను ఆహ్వానించు మన్త్రములు ఋగ్వేదము నందుండును. ఆ దేవతా శక్తులను గూర్చి తెలియవలెనననిచో ఐతరేయోపనిషత్తునందు చూడవలెను. ఉపనిషత్తులందు దేవతాశక్తులను గురించిన వివరములు సూక్ష్మముగా, బ్రహ్మభావమునకు సంబంధించిన వరకు మాత్రమే. ఈ దేవతాశక్తుల స్వరూపము, వాటి ధర్మములు, తక్కిన వివరములు తక్కిన వేదభాగముల యందుండును. మన్త్రభాగములయందు దేవతలను పిలుచువేళ, వాని లక్షణములుండును. బ్రాహ్మణములయందు యజ్ఞము సేయువేళ, ఆ దేవతలు మనకీయవలసిన భాగ్యము లుండును. ఉపాసనాభాగములందు దేవతలయొక్క ఏయే గుణములు మన మనస్సు స్వీకరింపవలెనో ఆయా గుణములు విపులముగా చెప్పబడును. ఆ వేళలందు అచ్చటనున్న శబ్దములు, వాక్య నిర్మాణము, అక్షరములు, ఉదాత్తానుదాత్త స్వరితమైన స్వరముతో, మన మనస్సును దేవతలున్న దివియందు విహరింపజేయును.

"అగ్నిర్వాగ్భూత్వా ముఖం ప్రావిశత్" (ఐతరేయోపనిషత్తు - (2.3)) అగ్ని వాగ్రూపమున ముఖమునందుండెనని తాత్పర్యము. అనగా ముఖమునందున్న ఆగ్నిశక్తి వలన మనము ఉచ్చరింపగలుగుచున్నాము. ముఖమునందు ఈ అగ్ని సమృద్ధిగా లేనివారు సమముగా ఉచ్చరింపలేరు. నత్తివారిని, ముద్దుగామాటాడు వారిని, మూగవారిని మనము చూచుచున్నాము. అగ్నిశక్తి ఒక్క వాక్కును మాత్రమే ఇచ్చుశక్తి కాదు. తక్కిన అవయవములందు, ఇతరములైన అవసరములను కల్పించును. ముఖమునందున్న అగ్ని మనమనుకొనెడు "నిప్పు" కాదని తెలియుచున్నదికదా! "అగ్ని" యొక్క సంపూర్ణ స్వరూపము తెలియవలెనని‌నచో, అన్ని వేదముల మన్త్రభాగములను, బ్రాహ్మణములను, ఆరణ్యక ములను, ఉపనిషత్తులను చూడవలెను. ఎందువలననగా వేదము పుట్టినది అగ్ని, వాయువు, సూర్యశక్తి మొదలైన దేవతా శక్తుల గుణగణములనొక్కచోట చెప్పుటకు కాదు. మనము పూర్ణాయుష్కులమగుట కొరకు, ధనవంతుల మగుట కొరకు, దుఃఖ రహితమైన, ఆనందమయమైన జీవనము గడుపుటకొరకు. ఈ విశ్వమందలి సకల ప్రాణులు మనవంటివే యని తెలుసుకొనుట కొరకు, ఈ జన్మలో మనకు పుట్టుకతో సంభవించిన లోపములను, ఈ జన్మలోనైనను లేక మరి యొక జన్మలో నైనను సరిదిద్దుకొనుటకు, ఒక్కమాటలో ఏ మహాచైతన్యము ఈ సకలసృష్టికిని కారణమో, ఆ బ్రహ్మ మును క్రమముగా తెలిసికొనుటకు, ఆ బ్రహ్మము మనమగుట కొరకు.

మన మూడు శరీరములందును, అగ్ని దేవతా శక్తి, ఏయే అవయవములందలి లోపములను పూరించవలెనో ఆయా స్థలములందు అగ్నియొక్క ప్రత్యేకగుణము పూర్తిగా వివరింపబడును. అచ్చట అగ్ని నాహ్వానించి మంత్రముల యందు, అచ్చటచ్చట జరుపు యజ్ఞవ్యాఖ్యానమయిన బ్రాహ్మణములయందు, ఆ యజ్ఞమునకు సంబంధించిన ఆరణ్యకమునందు చూడవలెను.

అగ్ని యొక్క వాక్ఛక్తి, ఐతరేయోపనిషత్తునందు ఎందుకు చెప్పబడినది? అగ్ని వాక్కునకు కర్తయగుట వలన, కర్తల వేదమైన ఋగ్వేదమందున్నది.ఋగ్వేదమందలి మంత్ర బ్రాహ్మణారణ్యకములందు గాక, ఉపనిషత్తునందున్నది. కారణము ఉపనిషత్తు, జ్ఞానశరీరమునకు సంబంధించినది కదా! వాక్కు జ్ఞానమునకు సంబంధించినది. శిష్యుడు గురువు వాక్కునుండియే జ్ఞానమును పొందుచున్నాడు. తన జానమును తన శిష్యునకు తన వాక్కు చేతనే అందచేయుచున్నాడు. కర్తలకు సంబంధించిన వేదమందు, జ్ఞానభాగమైన ఉపనిషత్తునందు, జ్ఞానమునకు ప్రధానమైన వాక్కుయొక్క "అధిదేవత" అగ్నియని చెప్పబడినది. వాక్కుయొక్క క్రియ ఉచ్చారణ. కనుక ఉచ్చారణను గురించి తెలియవలెనని‌నచో, క్రియా స్వరూపములన్నిటిని వివరించు యజుర్వేదమునందు జూడవలెను. ఉచ్చారణ జ్ఞాన సంబంధము కలది కాన, యజర్వేదేపనిషత్తునందు చూడవలెను. కృష్ణ యజుర్వేదోపనిషత్తు అయిన తైత్తిరీయోపనిషత్తు నందు, ఆరంభముననే, శాంతి మంత్రములు పూర్తికాగానే, శిక్షాధ్యాయము చెప్పబడినది. అక్షరముల ఉచ్చరించు పద్ధతికి "శిక్ష" వేదమిడిన పేరు.

శీక్షాం వ్యాఖ్యాస్యామః వర్ణస్వరః మాత్రాబలం సామసంతానః ఇత్యుక్తః శీక్షాధ్యాయః (తైత్తిరీయోపనిషత్తు ద్వితీయోనువాకము).

శిక్షను వ్యాఖ్యానింతము. వర్ణములు (అకారాదులు). స్వరములు (ఉదాత్తానుదాత్త స్వరితములు) మాత్రలు (హ్రస్వము, దీర్ఘము, ప్లుతము), బలము (అక్షరములనుచ్చరించు ప్రయత్నము), సామము (వీటినన్నిటినో లేక కొన్నిటినో కలిపి ఉచ్చరించుట) ఇది సంతతి–సంహిత(వాక్ప్రవాహము).ఈ విధముగా శిక్షాధ్యాయము చెప్పబడినది. ఇది పై మన్త్రభావము.

ఈ మహామన్త్రము, శిక్ష, వ్యాకరణము. మొదలైన అనేక శాస్త్రములకు "గంగోత్రి" పుట్టినచోటు.

ఈ విషయమెచ్చట చెప్పవలెనో వేదమిట్లు నిర్ణయించును.

సృష్టియొక్క సమైక్య భావమును పొందవలెనననిచో, మన యొక్క సంపుర్ణత్వమును తెలియవలెనననిచో, ఉపనిషత్తును వేరుగా చూడరాదు. వేదభాగముగనే చూడవలెను.